సాక్షి
కాకినాడ
శనివారం । 31 । మే । 2025



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నడింపల్లి ఎస్‌వీఎస్ రాజు, నాగదేవి దంపతులు (బెంగళూరు) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.




చెరువు గుటాయస్వాహా!

ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్లు కొందరు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తుందా.. పాగా వేసేద్దామా అంటూ ఎదురుచూస్తున్నారు.

10లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 10,650 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులు చేరింది. డెల్టా కాలువలకు నీరు విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో 11 మందికి స్థానం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగంలో జిల్లా నుంచి 11 మంది నేతలకు పదవులు దక్కాయి. పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. పార్టీ యువజన విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా దాడిశెట్టి శ్రీనివాస్ (తుని నియోజకవర్గం), ప్రధాన కార్యదర్శిగా తోట రాంజీ (జగ్గంపేట), కార్యదర్శులుగా బదిరెడ్డి సతీష్ గోవిందు బాబు (ప్రత్తిపాడు), మధిరెడ్డి దొరబాబు (పిఠాపురం), సంయుక్త కార్యదర్శులుగా కరణం భాను (పెద్దాపురం), ఎంజీకే కిషోర్ (కాకినాడ సిటీ), ఎం.హేమంత్ కుమార్ (తుని), వలవల భూషణం (పిఠాపురం); వలంటీర్ల విభాగం ప్రధాన కార్యదర్శిగా సూరెడ్డి తిరుమల రాయుడు (ప్రత్తిపాడు), సంయుక్త కార్యదర్శిగా తోట అయ్యన్న (జగ్గంపేట); విజ్ఞాన విభాగం సంయుక్త కార్యదర్శిగా అక్షింతల లక్ష్మణమూర్తి రాజా (జగ్గంపేట) నియమితులయ్యారు.

ఆలయ బాధ్యతల నుంచి ఏఈఓ తొలగింపు

అన్నవరం: ఒక మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నవరం దేవస్థానం ఏఈఓ కె.కొండలరావును ముందస్తు చర్యగా సత్యదేవుని ఆలయ బాధ్యతల నుంచి తప్పించి గోశాల, గార్డెన్స్ విభాగానికి మార్చారు. ఆయన స్థానంలో గోశాల, గార్డెన్స్ విభాగం ఏఈఓ పి.జగ్గారావును నియమించారు. ఈ మేరకు ఈఓ వీర్ల సుబ్బారావు శుక్రవారం ఆదేశాలిచ్చారు. ఈ నెల 13న సత్యదేవుని శ్రీపుష్పయాగానికి వచ్చిన తమపై కొండలరావు అనుచితంగా ప్రవర్తించారని, తన భార్యను తోసివేయడంతో ఆమె కింద పడిపోయిందని హైదరాబాద్‌కు చెందిన భక్తుడు హోతా కామేశ్వరశాస్త్రి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఈఓను సీఎంఓ అధికారులు ఆదేశించారు. దీనిపై విచారణాధికారిగా ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌ను ఈఓ నియమించారు.

12 కేంద్రాల్లో కానిస్టేబుళ్ల మెయిన్స్

కాకినాడ క్రైం: జిల్లావ్యాప్తంగా ఆదివారం జరిగే కానిస్టేబుల్స్ మెయిన్స్ పరీక్షల కోసం 12 కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఈ పరీక్ష జరుగుతుందన్నారు. సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ, కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ, టెక్నాలజీ కాలేజీ, మోహన్ కాలేజీ, ఐడియల్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, పీఎస్ లక్ష్మీ కాలేజీల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టికెట్టుతో పాటు ఒరిజినల్ గుర్తింపు పత్రాలు తప్పకుండా తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు అనుమతించబోమని స్పష్టం చేశారు. హెల్ప్ లైన్ నంబర్లు 94949 33233 (వాట్సాప్), డయల్ 112, 94407 96501, 94407 96513 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

రేపటి నుంచి 500 క్యూసెక్కుల విడుదల

కాకినాడ సిటీ: తూర్పు డెల్టాలోని రైతులు ఖరీఫ్ విత్తనాలు వేసుకొనేందుకు వీలుగా గోదావరి కాకినాడ, సామర్లకోట, బ్యాంక్ కాలువలకు ఆదివారం నుంచి రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అలాగే, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం, ఏలేరు రిజర్వాయర్‌ల నుంచి జూలై మొదటి వారంలోను, పంపా రిజర్వాయర్ నుంచి ఆగస్టు మొదటి వారంలోను నీటిని విడుదల చేస్తామని వివరించారు.

సత్యదేవుని సన్నిధిలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తి




జస్టిస్ రాజీవ్‌రాయ్‌కు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న ఈఓ సుబ్బారావు

అన్నవరం: పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్‌రాయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, స్వామివారి ఫొటో, ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

బాబుగారి బకాయి.. రూ.1,800 కోట్లు

- నిరుద్యోగులకు నిలువునా దగా
- ఉద్యోగమూ లేదు.. భృతీ లేదు
- ప్రతి నెలా చెల్లించాల్సినది రూ.150 కోట్లు
- ఏడాదిగా లక్షల మంది ఎదురుచూపులు



బకాయి పడ్డారిలా..

జిల్లా జనాభా 22,47,680. వీరిలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 16,36,389, పట్టణ ప్రాంతాల్లో 6,11,471 మంది ఉంటున్నారు. జిల్లావ్యాప్తంగా 5,33,908 కుటుంబాలున్నాయి. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజినీరింగ్, పీజీ ఇలా ఏదో ఒకటి పూర్తి చేసిన యువత ప్రతి కుటుంబంలో కనీసం ఒకరున్నారు. ఈ లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే జిల్లావ్యాప్తంగా 5 లక్షల మందికి పైగా నిరుద్యోగులున్నారని అంచనా. దీని ప్రకారం లెక్క వేస్తే ఇప్పటి వరకూ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వనందున ప్రతి ఒక్కరికీ రూ.3 వేల చొప్పున జిల్లావ్యాప్తంగా నెలకు రూ.150 కోట్లు పైగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాల్సి ఉంది. ఈ విధంగా ఏడాది కాలానికి లెక్క వేస్తే జిల్లాలోని నిరుద్యోగులకు చంద్రబాబు సర్కారు రూ.1,800 కోట్లకు పైగా బకాయి పడినట్లు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇటు ఉద్యోగాలివ్వకుండా.. అటు భృతి చెల్లించకుండా ప్రభుత్వం తమను మోసం చేసిందని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కూటమి నేతలుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే ఉద్యోగమైనా ఇవ్వాలి లేదంటే రూ.3 వేల నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



సర్కార్ నిర్ణయంతో రోడ్డున పడిన ఎండీయూ ఆపరేటర్ల ఆందోళన (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలిస్తాం.. ఉద్యోగాలు ఇచ్చేంత వరకూ ప్రతి నెలా రూ.3 వేల భృతి ఇస్తాం' అంటూ గత సార్వత్రిక ఎన్నికల వేళ కూటమి నేతలు నిరుద్యోగులను నమ్మించారు. వారి ఓట్లతో కూటమి గద్దెనెక్కి అప్పుడే ఏడాది కావస్తోంది. ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఇప్పటి వరకూ నయాపైసా భృతి కూడా ఇవ్వలేదు. అసలు ఆ హామీపై కిమ్మనడం లేదు. దీనిపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించిన చంద్రబాబు చివరకు ఎగనామం పెట్టారు. ఇప్పుడు కూడా అలాగే వంచిస్తున్నారని మండిపడుతున్నారు.

కాకినాడ ఉపాధి కల్పనా కార్యాలయంలో..	
రిజిస్ట్రేషన్ అయిన నిరుద్యోగులు	31,678
పదో తరగతి లోపు	2,289
పదో తరగతి	3,129
ఇంటర్మీడియెట్	5,784
గ్రాడ్యుయేట్లు	5,628
డిప్లొమా	3,430
ఇతరులు	13,785

జగన్ హయాంలో..



దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వాలంటీర్ (ఫైల్)

మాటల గారడీతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన చంద్రబాబుకు.. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలు అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఈ సందర్భంగా నిరుద్యోగ యువత చర్చించుకుంటున్నారు. డిగ్రీలు, పీజీలు, ఎంటెక్ వంటి ఉన్నత చదువులు చదివినా కనీసం చిరుద్యోగం కూడా లేదంటూ నిరుద్యోగులు కంట తడి పెట్టుకోవడాన్ని తన పాదయాత్రలో కళ్లారా చూసి, చలించిపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల పేరిట ప్రత్యేకంగా ఒక పెద్ద వ్యవస్థకే శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ప్రజలకు వారి ముంగిట్లోనే ప్రభుత్వ సేవలు అందగా.. నిరుద్యోగులకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు లభించాయి. జిల్లావ్యాప్తంగా 620 గ్రామ, వార్డు సచివాలయాల్లో 5,324 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. అలాగే, వివిధ ప్రభుత్వ శాఖల్లో జీరో వేకెన్సీ విధానంతో ఎప్పటి ఖాళీలను అప్పుడు భర్తీ చేశారు. వలంటీర్లను నియమించారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ కోసం వాహనాలు ఏర్పాటు చేసి, వందలాది మందికి ఉపాధి కల్పించారు. ఇలా అనేక విధాలుగా నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని తు.చ. తప్పకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసింది. దీనికి భిన్నంగా నేటి చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరిట గుప్పించిన హామీలు అమలు చేయలేదని, కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఇస్తామన్న భృతికి చాప చుట్టేసిందని, పైగా వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఇలా.. పలువురి ఉద్యోగాలు ఊడగొట్టిందని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు.

చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు



డిగ్రీ పూర్తి చేశాను. అయినా ఉద్యోగం రాలేదు. అయినా అక్కడితో ఆగిపోకుండా ఎంబీఏ, పీజీ కూడా చేశాను. ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. ఇంతలో సరిగ్గా ఏడాది క్రితం ఎన్నికలు వచ్చాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి నేతలు చెప్పారు. ఆ మాటలు నమ్మా. అయినా ఉద్యోగం రాలేదు. పోనీ ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి అయినా ఇస్తారని ఎదురు చూశాను. కూటమి అధికారంలోకి వచ్చి అప్పుడే ఏడాదైంది. ఒక్క రూపాయి కూడా భృతి ఇవ్వలేదు. 2014లో కూడా చంద్రబాబు ఇలాగే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి గాలి కొదిలేశారు.

– బొందాడ సుధాకర్, సర్పవరం, కాకినాడ రూరల్

అబద్ధాలతో బాబు మరో మోసం



ఎప్పుడూ చెప్పే అబద్ధాలతో చంద్రబాబు నిరుద్యోగులను మరోసారి మోసం చేశారు. 2014లో నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి తూతూ మంత్రంగా ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగం వస్తే కుటుంబాన్ని పోషించుకోవచ్చునని ఎదురు చూస్తున్న వారు లక్షల్లో ఉన్నారు. ఉద్యోగాలు కల్పించడం లేదు. అలాగని భృతి కూడా ఇవ్వడం లేదు. ఇలా దగా చేయడం అన్యాయం. బాబు అబద్ధాలు నమ్మి యువత మోసపోయింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోని చంద్రబాబును ఇకపై ఎవ్వరూ నమ్మరు.

– పెంకే రవితేజ, కన్వీనర్, నిరుద్యోగ యువత జేఏసీ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

బాబు వచ్చే.. జాబు పోయే



చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఉన్న ఉద్యోగాలు ఊడబెరికేస్తుంటారు. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. అధికారంలోకి రాగానే 20 లక్షల కొత్త ఉద్యోగాలిస్తామని నమ్మించారు. తీరా గద్దెనెక్కాక మద్యం దుకాణాల్లో పని చేసే 12 వేల మంది ఉద్యోగులను తొలగించి, 25 వేల కుటుంబాల పొట్ట కొట్టారు. ప్రజలకు వారి ఇళ్ల వద్దనే నిత్యావసర సరకులు అందజేయడానికి ఏర్పాటు చేసిన రేషన్ వాహనాలను ఎత్తేశారు. రాష్ట్రవ్యాప్తంగా 18 వేల మంది ఉద్యోగులను ఒక్క కలంపోటుతో తొలగించి, వారి ఉసురు పోసుకున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలిచింది. నేటి కూటమి ప్రభుత్వం ఉన్న ఉద్యోగులను తొలగించి నిరుద్యోగ యువతను దగా చేస్తోంది.

– తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, కాకినాడ

చంద్రబాబు సర్కార్‌పై సమర శంఖం

- ఒక్క హామీనైనా అమలు చేశారా?
- వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్క హామీ కూడా అమలు చేయని నేపథ్యంలో జూన్ 4న వెన్నుపోటు దినంగా పాటించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీలోని అన్ని స్థాయిల్లో నాయకులు, శ్రేణులు వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తనను కలిసిన మీడియాతో రాజా మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను వంచించి, వందకు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని ఆక్షేపించారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా చంద్రబాబు, కూటమి నేతలు ఏ ఒక్క హామీ అయినా అమలు చేసి ఉంటే ముందుకు వచ్చి చెప్పాలని డిమాండ్ చేశారు. మే నెల ముగిసిపోతోందని, ఖరీఫ్ సీజన్ మొదలవుతూండటంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారని అన్నారు. అయినప్పటికీ వారికి పెట్టుబడి సాయం ఇవ్వాలనే కనీస ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం అన్యాయమన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉండగా పీఎం కిసాన్‌తో కలిపి రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 రైతుకు అందించారన్నారు. చంద్రబాబు గద్దెనెక్కాక రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ ప్రారంభమైనా రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి అయినా పెట్టుబడి సాయంగా జమ చేశారా అని నిలదీశారు. అన్ని వర్గాలకూ చంద్రబాబు, కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకూ పార్టీ యావత్తూ ప్రజలు, బాధితులను సమన్వయం చేసుకుంటూ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జూన్ 4న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం పోస్టర్లను ఒకటి రెండు రోజుల్లో కాకినాడలో ఆవిష్కరిస్తామని రాజా చెప్పారు.

దేవదాయ భూములపై నివేదిక ఇవ్వాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): దేవదాయ శాఖకు చెందిన వివిధ రకాల భూములపై పూర్తి వివరాలు సేకరించాలని ఆ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడలోని ధార్మిక భవన్ నుంచి డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆలయాలకు ఇచ్చిన ఈనాం భూములు ప్రస్తుతం ఎలా ఉన్నాయి, అన్యాక్రాంతమయ్యాయా తదితర అంశాలతో నివేదికలివ్వాలన్నారు. దేవదాయ ఆస్తులు కబ్జా కాకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా కబ్జా జరిగితే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వచ్చి, ఆ భూములను కాపాడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో దేవదాయ శాఖ, ఈనాం భూములు, వివాదంలో, కోర్టు కేసుల్లో ఉన్న భూముల వివరాలను డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఈఓలు పాల్గొన్నారు.

అమాత్యులొస్తున్నారు.. మళ్లీ మొదలు పెట్టండి!



పూజలు చేసి, ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న అధికారులు



ఆర్‌ఓ ప్లాంట్ వద్ద భక్తులకు మంచినీరు ఇస్తున్న అధికారులు

'అయ్యగారొస్తున్నారు మళ్లీ మొదలెట్టండి' అన్నట్లుగా ఉంది పిఠాపురంలో కూటమి నేతల తీరు. స్థానిక పాదగయ క్షేత్రంలో భక్తులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు దివీస్ సంస్థ గతంలో రెండు ఆర్‌ఓ ప్లాంట్లు నిర్మించింది. నెల రోజుల క్రితమే ప్రత్యేక పూజలు నిర్వహించి మరీ జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, స్థానిక ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, దివీస్ సిబ్బంది వీటిని ప్రారంభించారు. ప్రస్తుతం, వీటి వద్ద భక్తులు మంచినీరు తాగుతున్నారు. ఇప్పుడు ఇదే ఆర్‌ఓ ప్లాంటును రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ఆదివారం మళ్లీ ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జనసేన నేతల ఆదేశాలకు తలొగ్గే అధికారులు ఇలా చేస్తున్నారని, లేకపోతే ఎప్పుడో ప్రారంభించిన వాటర్ ప్లాంటును మళ్లీ ఇప్పుడు మంత్రి చేతుల మీదుగా ప్రారంభించడమేమిటని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– పిఠాపురం

మడిలో.. పెట్టుబడి ఎలా?



- ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- 'అన్నదాత సుఖీభవ'పై కానరాని స్పష్టత
- గత ఏడాది ఎగనామం పెట్టిన సర్కారు
- ఈసారైనా ఇస్తారేమోనని అన్నదాతల ఎదురు చూపులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అకాల వర్షాలు.. అరకొర ధాన్యం కొనుగోళ్లు.. దక్కని గిట్టుబాటు ధరలు.. దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సిన దుస్థితి.. ఇటువంటి కష్టాల ఏటికి ఎదురీదిన జిల్లా రైతులు రబీని ఏదో ఒకవిధంగా ముగించుకుని, ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. దుక్కి దున్ని, భూమిని సిద్ధం చేసుకుంటూ.. విత్తనాలు, ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే సమయంలో సాగు పెట్టుబడి ఎక్కడి నుంచి తేవాలో అర్థం కాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీ ముగిసిపోయినా అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదు. దీంతో, గత సీజన్లలోనే బయటి వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టారు. వచ్చిన పంట దిగుబడులు విక్రయించి, ఆ అప్పులు తీర్చారు. ఇప్పుడు కూటమి వారి ఏలుబడిలో రెండో ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకూ రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో ఇప్పటికే మూడుసార్లు జమ చేసింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కనీసం ఒక్క విడత కూడా రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. మే నెలలో ఇస్తామని ప్రకటించారు. మరొక్క రోజులో ఈ నెల కూడా ముగిసిపోతోంది. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ జాబితాలు సిద్ధమయ్యాయని అంటున్నారే తప్ప, ఈ నగదు ఎప్పుడిస్తారు.. ఎంతిస్తారనే అంశంపై ఇప్పటికీ ఎటువంటి స్పష్టతా లేదు. దీంతో, ఈ ఏడాది కూడా అప్పులు తప్పవేమోనని రైతులు కలత చెందుతున్నారు.


2.36 లక్షల ఎకరాల్లో..

వచ్చే ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా రైతులు అన్ని రకాల పంటలూ కలిపి సుమారు 2.36 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారన్నది వ్యవసాయ అధికారుల అంచనా. జిల్లాలో ఖరీఫ్ వరి సాగుకు 42 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా, ప్రస్తుతం 10 వేల క్వింటాళ్లు ఉన్నాయి. దీంతోపాటు రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలు కూడా ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అవసరమైతే విత్తనాలు రప్పిస్తామని అంటున్నారు. అలాగే, ఖరీఫ్‌లో అన్ని రకాలూ కలిపి 48,363 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం జిల్లా యంత్రాంగం వద్ద 18 వేల మెట్రిక్ టన్నుల వరకూ బఫర్ స్టాక్ ఉంది.

గతంలో రైతుకు భరోసా

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు అడుగడుగునా అండగా నిలిచింది. ఖరీఫ్‌లో విత్తనాల కొనుగోలుతో పాటు సాగు పెట్టుబడికి ఇబ్బంది కలగకుండా ముందుగానే ఆర్థిక సాయం అందించేది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.7,500 ఇచ్చేది. ఏటా ఖరీఫ్ సాగుకు ముందు సరిగ్గా మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 జమ చేసేవారు. తర్వాత అక్టోబరులో ఖరీఫ్ పంట కోతలతో పాటు రబీ సాగు అవసరాలకు రెండో విడతలో రూ.4 వేలు ఇచ్చేవారు. ఆ తర్వాత జనవరిలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ మరో రూ.2 వేలు అందించేవారు. ఈవిధంగా ఒక్కొక్కరికి రూ.13,500 చొప్పున జిల్లాలోని 2 లక్షల మందికి పైగా రైతులకు మూడు విడతల్లో గడచిన ఐదేళ్లలో రైతు భరోసా ద్వారానే రూ.1,121 కోట్ల మేర లబ్ధి చేకూరింది. కరోనా సమయంలో సైతం ఎటువంటి సాకులూ చెప్పకుండా రైతు భరోసా నిధులను నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించేది. దీంతో పాటు వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి అనేక పథకాల ద్వారా రైతుకు ఆర్థికంగా అండనిచ్చింది.

పెట్టుబడి సాయం ఎప్పుడు?



గత సంవత్సరం రైతు భరోసా నిధులు పడలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేస్తున్నాం. వరి విత్తనాలు, ఎరువులకు డబ్బులు లేకపోవడంతో బయట అప్పులు తెచ్చుకొంటున్నాం. రైతులకు ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని ఈ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలి.

– తుమ్మలపల్లి తాతాజీ, రైతు, కరప

ఈ ఏడాదైనా ఇస్తారా?



అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేల చొప్పున సాయం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. గత సంవత్సరం ఇవ్వలేదు. ఈ ఏడాదైనా ఇస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. బయటి వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఎరువులు, పురుగు మందులు కొంటున్నాం.

– ఎర్నీడి సత్తిరాజు, రైతు జి.మేడపాడు, సామర్లకోట మండలం

క్లుప్తంగా

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సీఐ


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: పట్టణ పరిధిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బుధవారం సంత మార్కెట్ సెంటర్‌లో ఒక బాలుడు సెల్‌ఫోన్ చూస్తూ నడుచుకొంటూ వెళ్లిపోతున్నాడు. దానిని గమనించిన సీఐ ఎ.కృష్ణభగవాన్ బాలుడి నుంచి వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆ బాలుడు మూగవానిగా తెలుసుకున్నారు. దాంతో సెల్‌ఫోన్‌లో నంబర్‌కు ఫోన్ చేయడంతో ఆ బాలుడిని వేదాంశ్ కార్తికేయగా గుర్తించారు. సీఐ సమాచారం మేరకు తల్లి పోతుల తులసీ, తండ్రి శరత్‌కుమార్ ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. తాము విశాఖపట్నం నుంచి వేసవి సెలవుల కారణంగా కోట్లమ్మ చెరువు వద్ద బంధువుల ఇంటికి వచ్చామని తెలిపారు. రెండో తరగతి చదువుతున్న ఆరేళ్ల తమ కుమారుడు వేదాంశ్ కార్తికేయ సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకొంటూ బయటకు వచ్చేయడాన్ని తాము గమనించలేదని చెప్పారు. క్షేమంగా తమ కుమారుడిని అప్పగించినందుకు బాలుడి తల్లిదండ్రులు సీఐకి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మూల్యం తప్పదా..?!

- అప్రమత్తతపై అలక్ష్యం
- చాపకింద నీరులా విస్తరిస్తున్న కోవిడ్
- నానాటికీ పెరుగుతున్న కేసులు
- నివారణ చర్యలకు తిలోదకాలు
- కాకినాడ జిల్లాలో పరీక్షలు కేవలం జీజీహెచ్‌లోనే
- ముందు జాగ్రత్త చర్యలు లేవు
- అవగాహనా కార్యక్రమాలకు చెల్లుచీటి


జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న కోవిడ్ బాధితులు

కాకినాడ క్రైం: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చాలా రోజుల తర్వాత తనకు ఎదురైన తన స్నేహితుడిని ఆప్యాయంగా హత్తుకున్నాడు. ఆ వ్యక్తి అయ్యో ఎందుకిలా చేశావు, నాకు కోవిడ్ పాజిటివ్ వచ్చింది అని చెప్పాడు. కంగుతినడం ఈయన వంతైంది.

- మూడు రోజులుగా జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌కి మహాలక్ష్మినగర్ నుంచి వచ్చాడు. వైద్యులకు చూపిస్తే పరీక్షకు సిఫారసు చేశారు. కోవిడ్ అని తేలింది. జాగ్రత్తలు చెప్పడంతో పాటు ఇప్పటి వరకు ఎందుకు వైద్యం చేయించుకోలేదని వైద్యులు అడిగారు. తన భార్య, కుమారుడు రోజు సపర్యలు చేస్తున్నారని, తనతోనే ఉంటూ నిద్రపోయే వేళ కూడా చెరో వైపు పడుకొని నీరసించిన తనని చాలా బాగా దగ్గరుండి మరీ చూసుకుంటున్నారని చెప్పాడు. అందుకే ఆసుపత్రికి రావాలని కూడా అనుకోలేదని సమాధానమిచ్చాడు. అతడి సమాధానంతో వైద్యులు తలలు పట్టుకున్నారు.
- జీజీహెచ్‌లోనే పనిచేస్తున్న ఓ ఉద్యోగి కోవిడ్ సోకిందని తెలిసినా రోజువారీ విధులకు హాజరవుతున్నాడు. సహోద్యోగులతో కలిసి మాట్లాడుతూ, తిరుగుతూ సాధారణ జీవితాన్ని గడిపేస్తున్నాడు.

ఇదీ జిల్లాలో కోవిడ్ బాధితుల పరిస్థితి. తమ స్థితి ఏంటన్న కనీస అవగాహన కూడా వారికుండడం లేదు. ముంచుకు రానున్న ప్రమాదం పట్ల అవగాహన కల్పించే ఆలోచన అయినా ప్రభుత్వానికి లేదు.

మాస్క్ లేదు, శానిటైజేషన్ లేదు, మందులు లేవు, పరీక్షలు లేవు, నోడల్ బృందాలు లేవు, అవగాహన, అప్రమత్తత అసలే లేవు. సామాజిక దూరం లేదు, సామన్యుడి పట్ల బాధ్యత లేదు.... ఇదీ ప్రభుత్వం ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చాపకింద నీరులా ఉంది. ఈ విషయం ప్రభుత్వానికి ఆరోగ్యశాఖ ద్వారా తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కోవిడ్ అంటే పట్టనట్లే ప్రభుత్వం వ్యవహరిస్తుండడం ప్రజల్లో గుబులు రేపుతోంది. ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే జనబాహుళ్యంలో అవగాహన లేని వర్గాల పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. అవగాహన, అప్రమత్తతపై శాఖలకు కనీస ఆదేశాలు జారీ చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కేసులు నానాటికీ పెరుగుతున్నాయన్న అంతర్గత నివేదికల ఫలితమో ఏమో గురువారం నుంచి మాత్రం నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది.

ఎల్ఎఫ్–7 వేరియంట్

తాజా వేరియంట్ పేరు ఎల్ఎఫ్–7. ఈ వేరియంట్ ఒమిక్రాన్ లైనేజ్ జేఎన్.1 నుంచి ఉద్భవించింది. ప్రస్తుతం వస్తున్న నమూనాలలో ఈ వేరియంట్ జాడలే ఉన్నాయని మైక్రోబయాలజీ నిపుణులు చెబుతున్నారు.

ప్రమాదం కాదంటూనే...

ఎల్ఎఫ్–7 వేరియంట్ల వల్ల ప్రమాదం లేదంటూనే గర్భిణిలు, బాలింతలు, వయో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ప్రాణానికి కోవిడ్ వైరస్ వల్ల ప్రమాదం వాటిల్లవచ్చని హెచ్చరిస్తూండడం ఆందోళన కలిగిస్తోంది.

కనీస ఏర్పాట్లు శూన్యం

విస్తరిస్తున్న కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ఎటువంటి కనీస ఏర్పాట్లు లేవు. కోవిడ్ వ్యాక్సిన్ జిల్లాలో లేదు, టెస్టల నిర్వహణకు కిట్లు లేవు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల స్థాయిలో పరీక్షల నిర్వహణ, నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. మందుల కొరత కూడా ఉంది. మాస్కులు, శానిటైజర్ల వినియోగంతో పాటు కోవిడ్ అప్రమత్తతపై ఎటువంటి అవగాహన సదస్సులు, కార్యక్రమాలు కాదు కదా కనీసం కరపత్రాల పంపకం అయినా లేదు. కోవిడ్ నిర్వహణకు నోడల్ అధికారి నియమాకం కూడా జిల్లాలో లేదు. ఇందుకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

జీజీహెచ్‌లో మాత్రమే కోవిడ్ పరీక్షలు

జిల్లావ్యాప్తంగా కాకినాడ జీజీహెచ్‌లో తప్ప మరెక్కడా కోవిడ్ పరీక్షలు జరగడం లేదు. స్థానిక ఆరోగ్య కేంద్రాలైన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీ), ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీ)లో పరీక్షలు నిర్వహించడం లేదు. కనీసం ర్యాపిడ్ పరీక్షలు కూడా స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కోవిడ్ అనుమానం ఉంటే జిల్లాలో ఏ మూల ఉన్నా కాకినాడ జీజీహెచ్‌కు రావలసిందే.

మూడు రోజుల్లో 10 మందికి..

కేవలం కాకినాడ జీజీహెచ్‌లోనే మూడు రోజుల్లో 10 మందికి కోవిడ్ నిర్ధారణ అయింది. వీరిలో ముగ్గురు ఇన్‌పేషెంట్లుగా కోవిడ్ ప్రత్యేక వార్డులో ఉండి చికిత్స పొందుతున్నారు. ఐపీలో చేరిన వారిలో 13 ఏళ్ల బాలుడు కూడా ఉండడం గమనార్హం. అలాగే, ఓపీలో గడచిన మూడు రోజులుగా నిర్వహించిన పరీక్షల్లో ఏడుగురికి కోవిడ్ నిర్ధారణ అయిందని, అయితే వారంతా ఓపీ రోగులు కావడంతో ఇళ్లకు వెళ్లిపోయారని ఆసుపత్రి వర్గాల సమాచారం. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే ఓపీలో కోవిడ్ నిర్ధారణ అయిన వారిలో ఏ ఒక్కరూ జీజీహెచ్‌లో చికిత్స పొందలేదు. వారు ఎక్కడికి వెళ్లారో ఏమయ్యారో అధికారుల్లోనూ స్పష్టత లేదు. వారి ద్వారా వ్యాప్తికి అవకాశం ఉన్నా ఆ దిశగా ఏ మాత్రం చర్యలు లేవు. పరిస్థితిని అధికారుల వద్ద ప్రస్తావిస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని చెబుతున్నారు.

కోల్డా... కోవిడా...

ప్రజల్లో చాలామంది ఈ మధ్య కాలంలో జలుబు, గొంతు సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. కోల్డా(జలుబా) లేదా కోవిడ్ సోకిందా...! ఏదీ తేల్చుకోలేకపోతున్న గందరగోళ స్థితి ప్రజల్లో నెలకొంది. అందుకు కారణం, కోవిడ్ చాప కింద నీరులా మళ్లీ పురివిప్పుతున్న ప్రమాదకర స్థితి ఓ వైపు అయితే, వాయుగుండ ప్రభావంతో వాతావరణంలో చోటు చేసుకుంటున్న అసాధారణ మార్పులు ఇంకో వైపు. దీంతో గందరగోళంతో తాము ఏ స్థితిలో ఉన్నామో కూడా తెలుసుకోలేకపోతున్నారు. పోనీ పరీక్ష చేయించుకుందాం అనుకుంటే దగ్గర్లో టెస్టింగ్ సెంటర్లేవీ ఉండడం లేదు. దీంతో వైరస్ సోకిన వారే తమకు తెలియకుండా తామే వాహకాలుగా తయారవుతున్నారు.

చిలకముక్కు మామిడి!



ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గొనగాల గోపి పొలంలోని మామిడి చెట్టుకు చిలక ఆకారంలో మామిడికాయ శుక్రవారం దర్శనమిచ్చింది. మామిడికాయలు కోస్తున్న సమయంలో రైతు గోపి చిలక ఆకారంలో ఉన్న కాయను చెట్టుకు చూశాడు. మిగతా కాయలతో పాటు దీన్ని కోసి మార్కెట్‌కు తరలించారు. మార్కెట్‌లో ఈ కాయను స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలంటూ ధర్నా


వెంకటాయపాలెంలో లారీలను అడ్డుకుని ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజలు

రామచంద్రపురం రూరల్: ప్రమాదాలకు కారణమవుతున్న ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలని కోరుతూ వెంకటాయపాలెం, వేగాయమ్మపేట గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇసుక లారీలను అడ్డగించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి గోదావరి జిల్లాల నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ లారీలు, ముఖ్యంగా ఇసుక లారీలు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని మండి పడ్డారు. ఈ నెల 28న మహిళపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె మృతితో అప్పటికే తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులు తల్లిని కూడా కోల్పోయి అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాయపాలెం ప్రధాన రహదారి నుంచి వేగాయమ్మపేట, యర్రపోతవరం, యానాంలకు దగ్గరి దారిగా ఉండటంతో చీమలదిబ్బ గ్రామం నుంచి కాలువ గట్టు రహదారిపై నుంచి లారీలు రాకపోకలు సాగించడం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ఈ రహదారి ఇరుకుగా ఉండటం రెండు పక్కలా కాలువలు ఉండటంతో అధిక బరువు కలిగిన లారీల వల్ల రోడ్డు కూడా కుంగిపోయి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక లోడులు వేస్తున్న ఇసుక లారీలకు కనీసం బరకాలు కూడా కప్పకపోవడంతో లారీల వేగానికి ఇసుక ఎగిరి ప్రయాణికుల కళ్లల్లో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు లారీల వేగాన్ని నియంత్రించేలా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, చీమలదిబ్బ దారిలో లారీలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుసూరి వెంకటరమణ, ఇళ్ల సత్యనారాయణ, రాయుడు కృష్ణ, కోడి అర్జునుడు, ఇళ్ల గణపతి, అనుసూరి దుర్గ, దంగేటి జ్యోతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దడాల రవికుమార్ పాల్గొన్నారు.

చెరువు గుటా్కయస్వాహా!

- బియ్యపుగుంట చెరువును పూడ్చేసిన ఆక్రమణదారులు
- అధికార పార్టీ నాయకుల అండదండలతోనే
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు


ఆక్రమణదారులు పూడ్చివేసిన బియ్యపుగుంట చెరువు

నిడదవోలు: ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్లు కొందరు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తుందా.. పాగా వేసేద్దామా అంటూ ఎదురుచూస్తున్నారు. అధికార పార్టీ అండదండలు ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డు అదుపూ లేకుండాపోతోంది. ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. దీనికి తాజా ఉదాహరణగా నిడదవోలులోని బాలాజీనగర్‌లో మున్సిపాలిటీకి చెందిన బియ్యపుగుంట చెరువును ఆక్రమణదారులు పూడ్చివేశారు. బుధవారం రాత్రికి రాత్రే లారీలతో మంటి తరలించి 80 సెంట్ల ఉన్న చెరువును పూడ్చివేశారు. దీని విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుంది. రెండేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు చెరువు విస్తీర్ణాన్ని కొలిచి సరిహద్దు స్తంభాలను కూడా ఏర్పాటు చేశారు.

విలువైన భూమి

పట్టణ శివారున బాలాజీనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంజోరుగా సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి పొలాలు కొని వెంచర్లు వేసి అధిక ధరలకు విక్రయించి లాభపడుతున్నారు. ఈ ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన 80 సెంట్ల బియ్యపుగుంట చెరువుపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడ గజం భూమి రూ.10 వేలు పలుకుతోంది. సెంటు భూమి సుమారు 4.80 లక్షలు అయితే 80 సెంట్ల భూమి విలువ సుమారు రూ.4 కోట్లు పలుకుతోంది. రైతులకు ఈ చెరువు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఎక్కువగా చాగల్లు మండలం ధారవరం, బ్రాహ్మణగూడెం గ్రామాలకు చెందిన రైతులకు చెందిన 300కి పైగా పశువులు చెరువులో దాహం తీర్చుకునేవి. సుమారు 50 ఎకరాలకు సంబంధించిన మురుగునీరు చెరువుకు చేరడంతో పొలాలకు నష్టం లేకుండా ఉండేది. అయితే చెరువును పూడ్చివేయడంతో వర్షపునీరు, పంట మురుగునీరు వెళ్లే దారిలేక భవిష్యత్‌తో పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు తాగునీరు కరువవుతుందని వాపోతున్నారు.


గతంలో మున్సిపాలిటీ అధికారులు వేసిన సరిహద్దు ఐరన్ పోల్


తహసీల్దారు నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

చర్యలు తీసుకోవాలని వినతి

ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ నిడదవోలు తహసీల్దారు నాగరాజునాయక్, మున్సిపల్ కమిషనర్ టి, కృష్ణవేణిలను శుక్రవారం రైతులు కలుసుకుని వినతిపత్రాలు అందజేశారు. మున్సిపాటిటీకి చెందిన భూములు ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణాన్ని కొలిచి పూర్తి స్థాయిలో సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపుపై నిరశన

- నాలుగు రోజులుగా ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు
- అస్వస్థతకు గురైన బాధితురాలు పద్మ
- ఆసుపత్రికి తరలించిన సహచరులు


శంఖవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తూ సొమ్మసిల్లిన అంగన్‌వాడీ కార్యకర్త పద్మ


రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పద్మ

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రౌతులపూడి మండలం రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో 12 ఏళ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్న ఎం.పద్మను అక్రమంగా తొలగించి అదే గ్రామానికి చెందిన బీసీ డీ కులానికి చెందిన పాకిలా భవానీని విధుల్లోకి చేర్చుకోవడం అన్యాయమని ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 17 నుంచి ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు పనిచేసిన అంగన్‌వాడీ కార్యకర్తకు నోటీస్, రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా మరొకరిని విధుల్లోకి ఎలా చేర్చుకుంటారంటూ నాలుగు రోజులుగా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నారు. బాధితురాలు పద్మ నాలుగు రోజులుగా ఆహారం సక్రమంగా తీసుకోకుండా శుక్రవారం దీక్షలో కూర్చుంది. దీక్షలో కూర్చున్న గంటలో తీవ్ర అస్వస్థకు గురైంది. ఆమెను 108 వాహనంలో అంగన్‌వాడీలు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు.

అంగన్‌వాడీ కార్యకర్త పద్మకు పలువురి పరామర్శ

నిరాహార దీక్షకు పూనుకున్న అంగన్‌వాడీ కార్యకర్త ఎం.పద్మ అస్వస్థతకు గురవ్వడంతో శుక్రవారం పలువురు పరామర్శించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు శేషు బాబ్జి చికిత్స పొందుతున్న పద్మను పరామర్శించి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అప్పటివరకు పని చేస్తున్న కార్యకర్తలనే కొనసాగించాలంటూ గత ప్రభుత్వం 2020 డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసిందని, అయినా అధికారులు ఈ జీవోన దాచిపెట్టి, ఈ నెల 16న కోర్టు ఆర్డర్ ఉన్నదంటూ మరో ఆమెను విధుల్లోకి చేర్చుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పద్మను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు గెద్దం బుల్లమ్మ, బి.రత్నకుమారి, డి.సత్యవేణి, నూకరత్నం, రాజేశ్వరి పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

రాజమహేంద్రవరం రూరల్: స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), యువకాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాలపోసికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పిఠాపురం ఉప్పాడ రోడ్డులో వంగవీటి విగ్రహం ధ్వంసం చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వంగవీటి మోహనరంగా పేదల పాలిట పెన్నిధి, ఆయన విగ్రహాలపై రాజకీయాలు చేయొద్దని, విధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కౌన్సెలింగ్‌తో ఒక్కటైన దంపతులు


బడుగువానిలంకలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చొరవతో ఒక్కటైన దంపతులతో కుటుంబ సభ్యులు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో మూడేళ్ల క్రితం విడిపోయిన దంపతులు జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చొరవతో ఒక్కటయ్యారు. స్థానికుల కథనం ప్రకారం బడుగువానిలంకకు చెందిన పాలూరి వెంకటేష్‌తో పెదపళ్లకు చెందిన దేవి గౌతమికి 2014 లో వివాహమైంది. మూడవ కాన్పులో ఆడపిల్ల పుట్టిందనే కారణంతో 2022 మార్చిలో దేవి గౌతమిని పిల్లలతో సహా భర్త వెంకటేష్ పుట్టింటికి పంపించి వేశాడు. అప్పట్లో పెద్దల వద్దకు, ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి కాపురాన్ని నిలబెట్టాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది. ఇటీవల ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఆలమూరు మండలంలోని పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసరావు నియమితులు కావడంతో దేవి గౌతమి ఆయనకు తన పరిస్థితి వివరించింది. దీనిపై స్పందించిన వైస్ చైర్మన్ గారపాటి భర్త వెంకటేష్ నివాసానికి వెళ్లి, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సాయంతో కౌన్సెలింగ్ ఇచ్చి భార్యాభర్తలిద్దరితో పాటు కుటుంబ సభ్యులతో కలిసి కాపురానికి ఒప్పించడంతో కథ సుఖాంతమైంది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ కృషిని ఇరు గ్రామాల ప్రజలు అభినందించారు.

అమలాపురంలో తొలిసారిగా బాక్స్ క్రికెట్ పోటీలు


అమలాపురంలో తొలిసారిగా జరుగుతున్న బాక్స్ క్రికెట్ పోటీల పిచ్ (క్రికెట్ బాల్ బయటకు వెళ్లకుండా ఏర్పాటు చేసిన వలల వలయం)

అమలాపురం టౌన్: గుర్రాల విజయ కృష్ణ మెమోరియల్ పేరిట అమలాపురంలో మొట్టమొదటిసారిగా బాక్స్ క్రికెట్ పోటీలు స్థానిక గండువీధిలో ఈ నెల 28వ తేదీన మొదలయ్యాయి. జూన్ 3వ తేదీతో ఈ పోటీలు ముగిస్తాయని నిర్వాహకుడు కన్నా చెప్పారు. వారం రోజుల పాటు పోటీలను తమ సోదరుడి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొత్తం 40 జట్లు తలపడనున్నాయన్నారు. ప్రతీ మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీని విజేత జట్టుకు అందజేస్తున్నారు.